క్లుప్తంగా

హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసిన బార్ అధ్యక్షులు



నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకూర్‌ను శనివారం గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏపీ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వార్షిక సమావేశంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అలరించిన గాత్ర, వయోలిన్ కచేరీలు



నగరంపాలెం: బ్రాడీపేట 2/14వ అడ్డరోడ్డులోని నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత నృత్య పాఠశాల ఆవరణలోని త్యాగరాజస్వామి కళావేదికపై శనివారం గాత్ర, వయోలిన్ కచేరీలు నిర్వహించారు. గాత్ర కచేరీలో ఎస్.శాంతి, సింగరాజు సత్యసాయి విజయలక్ష్మి, వయోలిన్ కచేరీలో కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. వీరికి మృదంగంపై వి.కె.శాస్త్రి, వయోలిన్‌పై కె.రాజ్యలక్ష్మి సహకారం అందించారు. కచేరీలు సభికుల్ని అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత జస్టిస్ కె.జి.శంకర్, నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత నృత్య పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. సూర్యనారాయణ, నాగార్జున కల్చర్ సెంటర్ కార్యదర్శి పి.ఎస్.ఎన్.మూర్తి, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

మెరుగైన చేతిరాతతో విద్యలో రాణింపు



గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాతను మెరుగుపరుచుకోవడం ద్వారా విద్యలో రాణించవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 25 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు క్యాలిగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడి సొంత ఖర్చుతో చేతిరాత శిక్షణ తరగతుల్ని ఉద్యమంలా చేపట్టడం ద్వారా ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. రిసోర్స్ పర్సన్లుగా ప్రసాద్, అనిల్ కుమార్, నాగలక్ష్మి, రమాదేవి, షాజీర్, సత్యనారాయణ, బురాన్, శైలజారాణి వ్యవహరించారు. క్యాలిగ్రఫీ ఫ్యామిలీని ఏర్పాటు చేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామ్మోహన్‌ను రవీంద్రనాథ్ రెడ్డి అభినందించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

నగరంపాలెం: విశ్రాంత ఉద్యోగి ఇంట్లో నగదు చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంట గేటు ఒకటో వీధిలో ఉంటున్న సుబ్రహ్మణ్యశాస్త్రి విశ్రాంత ఉద్యోగి. భార్యాభర్తలు ఇంట్లో ఒంటరిగా ఉంటారు. వైద్యసేవలు నిమిత్తం ఇటీవల పోస్టాఫీస్‌లో రూ.2.10 లక్షలు డ్రా చేసి, బీరువాలో దాచుకున్నారు. శనివారం ఉదయం లేచేసరికి నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరు పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాల్ని సేకరించింది.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

కుమార్తె అదృశ్యంపై తండ్రి నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంపాలెంలో ఓ యువతి అద్దెకు ఉంటూ అరండల్‌పేటలోని ఓ దుకాణంలో పని చేస్తోంది. అయితే ఆమె రావడంలేదని దుకాణ యజమాని శ్రీశైలంలో ఉంటున్న తండ్రి సోమేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన నగరంపాలెంలో వెదికినా కుమార్తె ఆచూకీ కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న విద్యార్థులకు పోటీలు

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ, స్వాతంత్ర్యానంతర పరిస్థితులు, స్వాతంత్ర్య పూర్వ పరిస్థితులపై ఈనెల 14న వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట హైస్కూల్‌లో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ స్థాయిలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు చైర్మన్ వై.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, వక్తృత్వంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, క్విజ్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పేర్లను ముందుగా నమోదు చేసుకునేందుకు ఎ.వి.ఎస్.ఎస్.ప్రసాద్ 9492614809, సాంబశివరావు 98497 89799 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. 14న ఉదయం తొమ్మిది గంటల లోగా పోటీలలో పాల్గొనే అభ్యర్థులు స్కూల్‌కు చేరుకోవాలని చెప్పారు.

భద్రతకు లైసెన్స్

- డ్రైవింగ్ లైసెన్స్‌తో ఎన్నో ఉపయోగాలు
- ఇంటి నుంచే ఎల్‌ఎల్‌ఆర్ దరఖాస్తుకు అవకాశం
- లైసెన్స్ లేని డ్రైవింగ్‌తో శిక్షతో పాటు జరిమానా

నగరానికి చెందిన ఓ తల్లిదండ్రులు ప్రేమతో ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడికి లక్షలాది రూపాయల విలువ చేసే ద్విచక్ర వాహనాన్ని కొనిపెట్టారు. అయితే, ఆ విద్యార్థి కళాశాలకు వెళుతూ ఒక వ్యక్తిని ఢీకొట్టాడు. అతడు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. విద్యార్థికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో అతడితోపాటు తల్లిదండ్రుల పైనా కేసు నమోదు చేయాల్సి వచ్చింది. డ్రైవింగ్ లైసెన్సే కదా.. తీసుకుందాంలే ! అనుకుంటే ఇబ్బందికర పరిస్థితులే. వయసు పరిమితి దాటి కూడా లైసెన్స్ పొందలేదంటే, అది కచ్చితంగా మన తప్పే. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రోడ్డు పైకి వస్తే, అనుకొని ప్రమాదం జరిగితే ఫలితం దారుణంగా ఉంటుంది. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి. వాహనదారుడి భద్రతకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

పట్నంబజారు: నగరంలోని డెప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నిత్యం సగటున 150 మంది వరకు ఎల్‌ఎల్‌ఆర్, లైసెన్స్ నిమిత్తం వస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి స్లాట్లు బుక్ చేసుకుని, నిత్యం వందలాది మంది పరీక్షలకు హాజరవుతున్నారు. స్లాట్ల ప్రకారం ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లోని మండలాలు గుంటూరు ప్రాంతీయ రవాణా కార్యాలయ పరిధిలోకి వస్తాయి. 2022లో 30,384, 2023లో 21, 840, ఈ ఏడాది ఇప్పటి వరకు 12,572 వరకు లైసెన్సులు పొందారు.

సేవలు సులభతరం

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఎల్‌ఎల్‌ఆర్ అనుమతి పత్రాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం రవాణా సేవల్ని సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణా శాఖ పేరుతో 'మేళా' కార్యక్రమం కూడా నిర్వహించేవారు. రవాణా శాఖ అధికారులు ఏటా కళాశాలలకు వెళ్లి ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ ఆవశ్యకత గురించి వివరించి అనుమతులు ఇచ్చారు. ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు ఎల్‌ఎల్‌ఆర్ కోసం ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. మీ సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. స్లాట్ ప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత అధికారుల ముందు వాహనాలు నడిపి అనుమతులు పొందవచ్చు.

కంప్యూటర్‌పై అవగాహన లేక అవస్థలు

డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన సూచికల పరీక్షలో కంప్యూటర్ వినియోగించడం మినహా మరో మార్గం లేదు. ఉత్తీర్ణత సాధించాలంటే మాక్ టెస్టు ద్వారా ముందస్తుగా సాధన చేయడం తప్పనిసరిగా మారింది. గుంటూరు డీటీసీ కార్యాలయంలో రోజుకు కనీసం 150 వరకు నెలకు నాలుగు నుంచి ఐదు వేల వరకు డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 95 శాతం మంది అక్షరాస్యత కలిగి ఉన్నప్పటికీ కంప్యూటర్ వినియోగించడంలో కనీస నైపుణ్యం లేనివారికి ఇబ్బందులు తప్పడం లేదు. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవారే సూచికల పరీక్షలో బోల్తా పడుతున్నారు. ఇక ఏమాత్రం తెలియని వారి పరిస్థితి మరింత గందరగోళంగా మారి లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీనిపై అధికారులు ముందుగా తర్ఫీదు పొంది రావాలని చెబుతున్నారు.



డ్రైవింగ్ టెస్ట్ చేస్తున్న ఆర్టీవో శాఖ అధికారి

అరకొర డ్రైవింగ్‌తో రోడ్డెక్కితే ప్రమాదం

నేడు ప్రతి కుటుంబానికీ రెండు లేదా మూడు వాహనాలు ఉంటున్నాయి. ఇంట్లోని పెద్దాచిన్నా తేడా లేకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మానవుల జీవితానికి తక్షణ అవసరంగా మారిన వాహనాలను నడపటానికి ముందు రహదారి నిబంధనలు తెలుసుకోవాలి. ఆ తర్వాత రవాణా శాఖ నుంచి లైసెన్స్ తీసుకుని ఆపై రోడ్డుపైకి రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా అరకొర డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డు పైకి వచ్చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల ఎదుటివారి ప్రాణాలు గాలిలో కలిసిపో తున్నాయి.

నిర్లక్ష్యం వద్దు



సొంత వాహనాల్లో వెళ్లాలనుకునేవారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నప్పటికీ లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరం. ట్రాఫిక్ నిబంధనలను తెలుసు కోవాలి. డ్రైవింగ్‌లో పూర్తిస్థాయి శిక్షణ తీసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని స్లాట్ ప్రకారం ఎల్‌ఎల్‌ఆర్ పరీక్షలో ఉత్తీర్ణులై, అధికారుల ముందు వాహనాలు నడిపి లైసెన్స్ పొందవచ్చు.

– షేక్ కరీమ్ (డీటీసీ, గుంటూరు)

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే జరిగే నష్టాలు ఇవీ...

- రక్షణాత్మక డ్రైవింగ్ తెలియక తమతో పాటు ఎదుటి వాహనదారుల్ని మృత్యు కోరల్లోకి తీసుకెళ్తారు.
- మృతులకు ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అందదు.
- ప్రమాదంలో మరణించినవారికి ఇచ్చే రెట్టింపు ఇన్స్యూరెన్స్ రాదు. గాయపడిన వారికి మెరుగైన ఉచిత వైద్యసేవలు అందవు.
- ప్రాణాలతో బయటపడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు.
- రహదారుల నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన ఉండదు.
- మలుపుల వద్ద, వేగ నియంత్రికలు (స్పీడ్ బ్రేకర్లు) వద్ద రక్షణాత్మక డ్రైవింగ్ చేయలేరు.

ఇవీ తెలుసుకోవాలి

- గేర్లు లేని 50 సీసీలోపు ఇంజిన్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని నడపడానికి 16 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. తల్లిదండ్రుల సంరక్షకుల అనుమతి పత్రం తప్పనిసరి.
- గేర్లు లేకున్నా ఉన్నా 50సీసీ మించిన ద్విచక్ర వాహనం నడపాలంటే 18 ఏళ్ల వయస్సు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
- కారు, జీపు నడపడానికి 19 ఏళ్ల వయస్సు ఉండి లైసెన్స్ తీసుకోవాలి.
- లారీ, బస్సు, ట్యాక్సీలు నడపడానికి 20 ఏళ్ల వయస్సు నిండటంతో పాటు హెవీ వెహికల్ లైసెన్స్‌తోపాటు ఏడాది అనుభవం ఉండాలి.

అలరించిన కూచిపూడి నృత్య నీరాజనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ లలిత్ ప్రకాష్‌చంద్ర, డాక్టర్ ప్రవీణ్ నల్లపాటి, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శుభ గాత్రీ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక నాట్యాచార్యులు బీరక సురేష్ బాబు, శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కుమారి యశస్వి శుభగాత్రీ, రమ్య, నిఖిత, కీర్తన, చైత్ర, హాసిని, హన్సిక తదితరుల చక్కటి హావ భావాలతో నృత్యం చేశారు. నట్టువాంగంపై బీరక సురేష్‌బాబు, గాత్రం సీహెచ్.శాంతి, బంకుపల్లి విద్యాసాగర్ (నూజివీడు), వయోలిన్‌పై నాగేశ్వరరావు, మృదంగంపై వెంకట భరద్వాజ్, ఘటంపై ఏం.హరిబాబు, వేణువుతో వనమాలీ చక్కటి వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితాదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు. చివరగా అతిథులు కళాకారుల్ని సత్కరించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: అంబేడ్కర్ విగ్రహం వద్ద శిలాఫలకంపై అక్షరాలను ధ్వంసం చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాస్ డిమాండ్ చేశారు. కొండా వెంకటప్పయ్య కాలనీలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి అంటే రాజ్యాంగంపై దాడి జరిగినట్లేనని తెలిపారు. విగ్రహ ధ్వంసంపై సీబీడీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక విద్యా బోధనలో ప్రమాణాలు అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యా బోధనలో ఆధునికత్వంతో కూడిన ప్రమాణాలు అవసరమని నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం అతిథి ఉపన్యాసకురాలు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఆర్.కె.రమ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం, జాతీయ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్‌తో పాటు చైల్డ్ ప్రొటెక్షన్ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రమ మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి చిన్నతనంలోనే బాటలు వేయాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక విద్య పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ విద్య బోధిస్తున్న ఉపాధ్యాయులు తమను తాము మలచుకుంటూ బోధించాలని, తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి పసితనంలోనే బాటలు వేసినవారవుతారని పేర్కొన్నారు. గత దశాబ్దంగా పాత మూస బోధనలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జాతీయ విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నారని తెలిపారు. కాలానుగుణంగా పిల్లల్లో వారి ఐక్యూస్థాయికి తగిన విధంగా సమగ్ర వికాసానికి బోధనాంశాలు ఉండాలని సూచించారు. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలపై విజ్ఞాన్ అధ్యాపకురాలు డాక్టర్ నాగమల్లేశ్వరి, అధ్యాపకురాలు రమ మావూరి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్, ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యావేత్త రమ

రేపటి నుంచి స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా విధానంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకే ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. చరిత్రను పాఠశాలస్థాయికే పరిమితం చేస్తూ విశ్వవిద్యాలయాల స్థాయిలో విస్మరించడం పూడ్చలేని అగాధం ఏర్పడుతోందని తెలిపారు. సాఫ్ట్‌వేర్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై దృష్టి పెడుతూ, చరిత్రను మరచిపోవడం మానవ మనుగడకే ప్రమాదమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చరిత్రపై ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈనెల 12న గుంటూరు కొత్తపేటలోని కాసు శాయమ్మ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, ఈనెల 13న పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల, ఈనెల 14న లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని శాంతమూర్తి తెలిపారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

నెహ్రూనగర్: మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు రెవరెండ్ జె.సతీష్ బాబు, పాదర్ చంద్రమోహన్ నుదురుపాటి అధ్వర్యంలో శనివారం జాతీయ క్రైస్తవ నిరసన దినం పాటించారు. గుంటూరు సెయిట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ చర్చి నుంచి ఆంథోనీ వారి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సతీష్‌బాబు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే అంశాల్ని నిర్మూలించి, క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1950 ఆగస్టు 10న తేదీన రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వెలువడిన రాజ్యాంగ ఆర్డర్‌లోని మూడవ పేరాలో హిందూ మతంలో దళితులకు మాత్రమే ఎస్సీ కోటా వర్తిస్తుందని పేర్కొన్నారు. దీనిపై గత 70 సంవత్సరాలుగా వివాదం జరుగుతూనే ఉందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికపై అందరికీ సమానంగా రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని ఆయన కోరారు. ఫాదర్ చంద్రమోహన్ మాట్లాడుతూ దళితులు, గిరిజనులు ఏమతంలో ఉన్నా వారి సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనంలో పెద్దగా మార్పులేదని పలు అధ్యయన సంస్థలు పేర్కొన్నాయన్నారు. చాలా మంది దళిత క్రైస్తవులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, అన్ని రకాల దోపిడీకి, సామాజిక వివక్షకు గురవుతున్నారని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ పేర్కొందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు రెవరెండ్ విల్సన్, రెవరెండ్ చక్రిధర్, రెవరెండ్ ఆశీర్వాదం, మనోహర్, కార్పొరేటర్ బూసీ రాజలత, కర్రా హనోక్ బెంజిమెన్, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దళిత క్రైస్తవ సంఘ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో ప్రదర్శన

గుంటూరు మెడికల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాకాండకు వ్యతిరేకంగా బీజేపీ, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం శంకర్‌విలాస్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంత కార్యదర్శి వెంకట రమణమూర్తి, సభ్యులు మున్నలూరి నాగేశ్వరావు, గుంటూరు జిల్లా సంయోజక్ దుర్గాబాబు, సహ సంయోజక్ నవీన్ రెడ్డి, నగర సంయోజక్ వీరేంద్ర కుమార్, సహ సంయోజక్ రామ్మోహన్‌రావు, బీజేపీ నాయకులు కిడాంబి దేవరాజు, పాలపాటి రవికుమార్, తిరుపతిరావు, కోలా రేణుకాదేవి, వెలగలేటి గంగాధర్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, ప్రతాప్, ప్రసాద్, లంక రవిశంకర్, మైలవరపు ప్రవీణ్ పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరిగిన దాడులు



నెహ్రూనగర్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగిపోయాయని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి జయప్రకాష్ కెనడీ ధ్వజమెత్తారు. లాడ్జి సెంటర్‌లోని మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు.టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు భయంతో ఇళ్లు వదిలి వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. రాష్ట్రంలో దళితులను విభజించు, పాలించు అనే ధోరణితో కూటమి పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణ న్యాయమూర్తులతో కాలం చెల్లిన వర్గీకరణను బతికించి దళిత వర్గాల్ని సర్వనాశనం చేయాలని చూస్తుందని మండిపడ్డారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దళిత వర్గాలు వేయడం నేరమా? అని జయప్రకాష్ కెనడీ ప్రశ్నించారు. వర్గీకరణ అనేది ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్‌లో సవరణ చేసిన తరువాతే దాన్ని అమలు చేయాలని, పార్లమెంట్ కళ్లకు గంతలు కట్టి దొడ్డిదారిన ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ పేరుతో దళితులను ఇబ్బందులకు గురిచేసే విధంగా క్రిమిలేయర్‌ను తెర మీదకు తెస్తున్నారని, దీన్ని మాదిగలు గమనించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బత్తుల అనిల్‌బాబు, రవికుమార్, శోభన్‌బాబు, రాజు, అన్నలదాసు ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్రాంత అదనపు డీజీపీ బాబూరావు

దళితుల ఆత్మగౌరవానికి అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వు

నెహ్రూనగర్: మత స్వేచ్ఛ విషయంలో దళితులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్ని కొనసాగించాలంటే 1950 రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని విశ్రాంత అదనపు డీజీపీ డాక్టర్ బాబూరావు పేర్కొన్నారు. ఏసీ కాలేజీలోని జేడీ శీలం హాలులో దళితులకెందుకు ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయి ? అనే అంశం మీద శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల వల్ల దళితులకు ప్రాథమిక హక్కులు నిరాకరించబడ్డాయన్నారు. దీని వల్ల మత స్వేచ్ఛ లేకుండా పోయిందని తెలిపారు. ఆర్టికల్ 14 చెప్పిన సమానత్వ హక్కును, ఆర్టికల్ 16 చెప్పిన సమాన అవకాశాలను 1950 నాటి ఉత్తర్వులు అడ్డుకుంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 విశ్వసించు, అనుసరించు, ప్రకటించు...అనే హక్కును పౌరులకు కల్పించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును రాష్ట్రపతి ఉత్తర్వు కాలరాసిందని పేర్కొన్నారు. 1950 ఆగస్టు 3న జరిగిన చర్చలలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌తో పాటు ఇతర సభ్యులు కూడా రాష్ట్రపతి ఉత్తర్వులను వ్యతిరేకించినట్లు ఆయన గుర్తు చేశారు. దళితుల ఆత్మగౌరవానికి, మత స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు అడ్డుగా ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి త్వరలో వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పులిగుజ్జు సురేష్, ఏసీ కాలేజీ ప్రిన్సిపాల్ కె. మోజెస్, హై కోర్టు లాయర్ గద్దం ఏలీషా, రిటైర్డ్ ఎస్పీ కాకుమాను రాజశేఖర్, శివశంకర్, సాల్మన్, విజయశేఖర్, కర్ర జోసెఫ్, సతీష్‌కుమార్, శోభన్‌బాబు, చిట్టిబాబు, పరిశపోగు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

సహస్ర ఆర్థో సెంటర్‌కు జాతీయ గుర్తింపు



గుంటూరు మెడికల్: కొత్తపేటలోని 'సహస్ర ఆర్థో - న్యూరో సెంటర్'కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ప్రముఖ ఆర్థ్రోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజురీ స్పెషలిస్ట్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి చెప్పారు. కొత్తపేటలోని హాస్పిటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకాలి, భుజం, క్రీడా గాయాలకు సంబంధించి భారతదేశం అంతటా ఆర్థోపెడిక్ సర్జన్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ దేశంలోని అతి కొద్ది కేంద్రాల్లో ఒకటిగా తమ హాస్పిటల్‌ను ఎంపిక చేసిందని చెప్పారు. దేశవ్యాప్తంగా మొత్తం 31 కేంద్రాలకు గుర్తింపు లభించిందని తెలిపారు. సహస్ర ఆర్థో - న్యూరో సెంటర్ వైజాగ్, గుంటూరులో సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. తమ సెంటర్‌లో ఆర్థ్రోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజురీస్ విభాగంలో ఫెలోషిప్ శిక్షణను ప్రారంభిస్తున్నామని తెలిపారు. తాము ఇచ్చే ఫెలోషిప్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని చెప్పారు. భారతదేశం నలుమూలల నుంచి ఆర్థోపెడిక్ సర్జన్లు వచ్చి గుంటూరులోని సహస్ర ఆర్థో - న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ ప్రోగ్రాంను చేయవచ్చని తెలిపారు.

సీజీహెచ్‌ఎస్ వెల్నెస్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

లక్ష్మీపురం: సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం (సీజీహెచ్‌ఎస్) వెల్నెస్ సెంటర్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం సీజీహెచ్‌ఎస్ కో- ఆర్డినేటర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి కోరారు. కలెక్టరేట్ ఎదురుగా గల సీజీహెచ్‌ఎస్ వెల్నెస్ సెంటర్ శనివారం మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య చౌదరి ఆయన దృష్టికి సమస్యల్ని తీసుకు వచ్చారు. గుంటూరు వెల్నెస్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, అన్ని వైద్య, పరీక్ష సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఒక్కటే సెంటర్ ఉండటంతో పెన్షనర్లు, ఉద్యోగులు గుంటూరుకు రావడం వ్యయ ప్రయాసలతో కూడుకుందని తెలిపారు. ప్రతి నూతన జిల్లాలోనూ వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు. స్పందించిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్ డాక్టర్లు ఎం.సీహెచ్.కోటేశ్వరరావు డి.తుకారామ్, బేగం, ఆయేషా, రామారావు, మురళి పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: సచివాలయ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు శనివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో వార్డు శానిటేషన్ సెక్రటరీలను డిగ్రీ అర్హతతో టెక్నికల్ సర్వీస్ కోసం నియామకం చేసుకుని, కేవలం నాన్ టెక్నికల్ సర్వీసెస్‌కు వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషనలైజేషన్‌లో శానిటేషన్, పర్యావరణ సెక్రటరీలను వారి లైన్ డిపార్ట్‌మెంట్స్ అయిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్రీ, మెడికల్ అండ్ హెల్త్, ఇతర ప్రభుత్వ శాఖల్లో వారి విద్యార్హతలకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ ట్రెజరర్ దుర్గారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లయ్య, జాహ్నవి, కవిత, దివ్య, సునీత, అరుణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధం అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం కనుసన్నల్లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని ఆరోపించారు. వర్గీకరణ తీర్పును తెలుగు రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులు అమలు చేయాలని చూస్తే కచ్చితంగా రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వర్గీకరణ తీర్పుతో రిజర్వేషన్లకే ప్రమాదం పొంచి ఉందన్నారు. అప్పటి జనాభా నిష్పత్తి ప్రకారం అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన 15శాతం రిజర్వేషన్లకే దళితులు పరిమితమయ్యారని తెలిపారు. నేడు ఆ రిజర్వేషన్లనే విభజించి పాలించే సిద్ధాంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నుకున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోదా జాన్‌పాల్, రామచందర్, తాళ్లపల్లి రవి, కొండబాబు, సుధాకర్, నీలాంబరం, కుమారి, సునీత, పున్నమ్మ, నాయకులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు